ప్రజాశక్తి

శనివారం 6 జనవరి 2024 — 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

(వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో)



విజయవాడ ధర్నా చౌక్‌లో అంగన్వాడీల ధర్నాలో అభివాదం చేస్తున్న నేతలు

సమస్యలు పరిష్కరించకుంటే దేశవ్యాప్త ఉద్యమం

ఆల్ ఇండియా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు



విజయవాడ లెనిన్ సెంటరులో పొర్లు దండాలతో నిరసన తెలుపుతున్న కార్మికులు

(వార్తలు లోపలి పేజీల్లో)

పొర్లు దండాలతో మున్సిపల్ కార్మికుల నిరసన

టిడిపిలో ముసలం



- కేశినేని నానికి టికెట్ ఇవ్వబోనని చంద్రబాబు ప్రకటన
- పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశం
- స్వతంత్రంగా పోటీ చేసైనా గెలుస్తా : నాని

ప్రజాశక్తి - విజయవాడ : తెలుగుదేశం పార్టీలో ముసలం మరింత ముదిరింది. కేశినేని సోదరుల మధ్య విభేదాలు రోడ్డెక్కడంతో పార్టీ అధినేత చంద్రబాబు చర్యలకు ఉపక్రమించారు. నిన్న మొన్నటి వరకు ఒకరిపై ఒకరు విమర్శలకే పరిమితమైన కేశినేని సోదరులు ఈనెల 3వ తేదీన ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులోని పార్టీ కార్యాలయంలో ఏకంగా బాహాబాహీకి దిగారు. ఈ రగడతో విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని)పై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని ఏకంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ సమాచారాన్ని ముగ్గురు పార్టీ నేతల ద్వారా నానికి పంపారు. 'ఈసారి ఎంపి టికెట్ ఇవ్వబోనని' నానితో చంద్రబాబు అన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు నాని సోదరుడు కేశినేని చిన్నికి చంద్రబాబు మద్దతుగా నిలిచారు. ఈ పరిణామాలపై ఎంపి నాని తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. శుక్రవారం విజయవాడలోని తన కార్యాలయం వద్ద తనను కలిసిన మీడియాతో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అధినేత చంద్రబాబు పట్ల ఆచితూచి మాట్లాడినా...ప్రజల ఆశీస్సులతో మూడోసారీ తానే విజయవాడ ఎంపిగా గెలుపొందుతానని అన్నారు. ఈ వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అధినేత చంద్రబాబు ఆదేశాలతో ఇప్పుడు నాని దారెట అన్న ప్రశ్న ఉదయిస్తోంది. ఇప్పటి వరకు ఆయనను నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో కూడా అయోమయం నెలకొంది. మీడియా వేసిన పలు ప్రశ్నలకు ఎంపి కేశినేని సమాధానమిస్తూ... కాలమే నిర్ణయిస్తుందన్నారు. తాను ఇప్పటికీ టిడిపిలోనే ఉన్నానన్నారు. అంతేగాక తమ పార్టీ అధినేత చంద్రబాబు అని గతంలోనే తాను చెప్పానన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసైనా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో గెలుపొందుతాననే ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎటువంటి సందేహమే లేదన్నారు. తన అభిమానులు, అనుయాయులతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని చెప్పుకొచ్చారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అధినేత ఆదేశించడంతో ఈ విషయంలో మీ తమ్ముడు చిన్ని గెలిచినట్లుగా పార్టీలో కొందరు అనుకుంటున్నారని విలేకరులన్న దానిపై కేశినేని స్పందిస్తూ... పోటీలో గెలుపోటములు సహజమని, ఇద్దరు పోట్లాడుకుంటే ఎవరో ఒక్కరే గెలుస్తారని, అయితే ఇక్కడ ఎంపి గెలుపనేది ప్రజలు నిర్ణయించాల్సి ఉందని అన్నారు. మొదటి నుంచీ నియోజకవర్గంలో తనను నమ్ముకొని కొన్ని వేల మంది ఉన్నారని, వారి మనోభావాలను దృష్టిలో పెట్టుకొని తన భవిష్యత్తు నిర్ణయం ఉంటుందని నాని అన్నారు. దేవినేని ఉమా వ్యతిరేక గ్రూపుకు నాయకుడు, ఎంపికి అనుచరుడుగా ఉన్న పార్టీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించే సమావేశానికి వెళ్తారా అన్న ప్రశ్నకు ...పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అధినేత చంద్రబాబు జారీ చేసిన ఆదేశాలను శిరసా వహిస్తానని చెప్పారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా పెట్టడాన్ని ఎలా చూస్తారని విలేకరులు వేసిన ప్రశ్నకు ఎంపి కేశినేని సమాధానమిస్తూ...తాను పార్టీ కార్యక్రమాలకు మాత్రం దూరంగా ఉంటానని అన్నారు. కానీ తాను ఒక ఎంపి స్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటానని, అది ప్రజాశ్రేయస్సు దృష్ట్యా, తన నియోజకవర్గ పరిధిలో ఏ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు పిలిచినా వెళ్తానని చెప్పారు. తనను గతంలోనే పలువురు టిడిపి నాయకులు అనరాని మాటలు అన్నారని, చాలా ఓపిక పట్టి ఉన్నానని అన్నారు. 2019లో రెండోసారి ఎంపిగా గెలిసి సమయంలోనే అనేక పార్టీల నుంచి పిలుపులొచ్చిందన్నారు. అనేక అవకాశాలొచ్చినా పార్టీ అధినాయకుడు కష్టాల్లో ఉన్నారని తాను ఎటువైపూ వెళ్లకుండా పార్టీ కోసం ఉన్నానని అన్నారు. పార్టీ అధినేతను తాను ఇప్పటికీ తప్పు పట్టడం లేదని, గెలుపే ముఖ్యమైనప్పుడు చంద్రబాబుకు కూడా కొన్ని వత్తిడులు, బాధ్యతలు ఉంటాయని అన్నారు. ఏదిఏమైనా వచ్చే ఎన్నికల్లో తాను ఇండిపెండెంట్‌గానైనా నిలబడి ఎంపిగా తెలుస్తాననే నమ్మకం తనకుందని కేశినేని నాని అన్నారు.

నూతన జెసి గీతాంజలి శర్మ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా గీతాంజలి శర్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన అపరాజితా సింగ్ సిన్వార్ ఉత్తర ప్రదేశ్ క్యాడర్‌కు బదిలీ అయ్యారు. ఈనేపథ్యంలో 2020 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన గీతాంజలి శర్మను కష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బాధ్యతలు చేపట్టిన అనంతరం గీతాంజలి శర్మ...జిల్లా కలెక్టర్ పి. రాజాబాబును ఆయన చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన జెసిని డిఆర్ఒ పి.రోజా, ఆర్‌డిఒ ఎం.వాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బాలికపై ఉపాధ్యాయుడు లైంగిక దాడి

- దేహశుద్ధి చేసిన స్థానికులు
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

ప్రజాశక్తి - కోడూరు : నాలుగో తరగతి చదువుతున్న బాలికపై ఓ ఉపాధ్యాయుడు లైంగిక వేదింపులకు పాల్పడ్డాడు. కృష్ణాజిల్లా కోడూరు మండలం ఉల్లిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఈనెల రెండో తేదీన జరిగిన ఈ ఘటన మూడు రోజులు ఆలస్యంగా శుక్రవారం వెలుగు చూసింది. బాలిక తల్లి కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఆ ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేసింది. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసుల కథనం ఇలా ఉంది. ఉల్లిపాలెం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నరహరశెట్టి సుబ్బారావు ఆ పాఠశాలలో నాలుగోతరగతి చదువుతున్న తొమ్మిదేళ్ల బాలికపై తరగతి గదిలోనే అసభ్యంగా ప్రవర్తించాడు. పాఠశాల నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత బాలిక తన తల్లికి ఉపాధ్యాయుడు చేసిన అకృత్యాన్ని తెలిపింది. గ్రామస్తులతో కలిసి పాఠశాలకు వెళ్లి ఈ ఘటనపై ఉపాధ్యాయుడిని నిలదీసింది. సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకునేందుకు ప్రయత్నించడంతో గ్రామస్తులు ఆ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం అందడంతో ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తీసుకు వచ్చారు. అయితే రాజకీయంగా పరపతి ఉన్న ఉపాధ్యాయుడి బంధువు ఈ ఘటనపై కేసు నమోదుకాకుండా రాజీకి ప్రయత్నించినట్లు తెలిసింది. దీంతో ఫిర్యాదు ఆలస్యమైంది. బాలిక తల్లి రాజీకి అంగీకరించకుండా ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు కోడూరు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

విద్యాశాఖ విచారణ

బాలికపై లైంగిక వేధింపులు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో విద్యాశాఖ అధికారులు విచారణ ప్రారంభించారు. మండల విద్యాశాఖాధికారి రామనాథం నేతృత్వంలో పాఠశాలలో విచారణ జరుపుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను, తోటి ఉపాధ్యాయులను ఆరా తీశారు.

మాడిపోతున్న పూత!

- దిగుబడులపై మామిడి రైతుల్లో ఆందోళన
- మందగించిన తోటల వ్యాపారం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

మిచౌంగ్ తుపాను ప్రభావం మామిడి తోటలపైనా పడింది. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో నేలలో తేమ అధికమవ్వడంతో అప్పటికే మామిడి తోటల్లో వచ్చిన పూత మాడిపోయి రాలిపోయింది. తిరిగి తోటల్లో పూత రావడం నెల రోజులపాటు ఆలస్యమైంది. ఈక్రమంలోనే మామిడి దిగుబడులపై రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటల కొనుగోలుకు వ్యాపారులు ఆసక్తి చూపకపోవడంతో వ్యాపారం మందగించింది.

కృష్ణాజిల్లా బాపులపాడు, గన్నవరం, అవనిగడ్డ ప్రాంతాల్లోని 11,336 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. మామిడి మార్కెట్లో తరచూ ధరల హెచ్చు తగ్గుల మాయాజాలంతో నష్టపోతున్న రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేందుకు గత కొన్నేళ్లుగా తోటలను సీజనల్ లీజులకు ఇస్తున్నారు. వ్యాపారులు కాపుకు ముందే మామిడి తోటలను కొనుగోలు చేస్తారు. తోటల్లో చెట్లకు వచ్చిన పూత ఆధారంగా చేసుకుని కాపును (దిగుబడులు) అంచనా వేసి రైతులకు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ముందస్తుగా చెల్లిస్తారు. పంట కాలానికి లీజుకు తీసుకుంటారు. నవంబర్ నెలాఖరుకు, డిసెంబర్ చివర వారంలో తోటలకు వచ్చే పూతను పరిశీలించి వ్యాపారులు తోటలు కొనుగోలు చేస్తారు. పూత నిల్వడానికి తోటల్లో మందులు పిచికారీ చేస్తారు. తోటలకు కాపలాను ఏర్పాటు చేసుకుంటారు. దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం కలిసి వస్తుంది. అయితే ఈ ఏడాది మామిడి పూత, కాపుపైన వాతావరణ



పూతరాని మామిడి తోట

పరిస్థితులు ప్రభావం చూపుతాయి. భూమిలో తేమ, వాతావరణంలో తగిన ఉష్ణోగ్రతలు ఉన్న సమయంలోనే పూత వస్తుంది. నవంబరు చివరి వారం నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకు దశల వారీగా మామిడి తోటలకు పూత వస్తుంది. నవంబర్, డిసెంబర్ మొదటి వారంలో ముందస్తుగా వచ్చే పూత, కాపుకు మార్కెట్లోనూ మంచి ధర లభిస్తుంది. జనవరి 15 తర్వాత మంచు ఎక్కువగా ఉంటుంది. కాయలకు మంగు తెగులు ఎక్కువగా వస్తుంది. అయితే ప్రస్తుతం వాతావరణ ప్రభావం, ప్రస్తుత పరిస్థితులను అంచనా వేస్తున్న వ్యాపారులు తోటలను లీజుకు

(మిగతా 6లో)

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు గ్రామంలో సిరి కాంప్లెక్స్‌లో చిల్లకల్లు గ్రామ వైసిపి కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వవిప్, శాసనసభ్యులు సామినేని ఉదయభాను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పాలకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నూతన గ్రామ పార్టీ అధ్యక్షులుగా సుంకర వేణుమోహన్ రావు నియమించిన సందర్భంగా ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. చిల్లకల్లు రానున్న రోజుల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎస్సీ కాలనీ స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ కూడా మరొక నెలలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

వికలాంగుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మైలవరం : ద్వారకాతిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్.వి.సుధాకర్ రావు, మైలవరానికి చెందిన పలువురు ఇబ్రహీంపట్నంకు చెందిన వికలాంగుడికి శుక్రవారం రూ.90 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇబ్రహీంపట్నంకి చెందిన రేవల్ల వెంకటేశ్వర్లు 2001వ సంవత్సరంలో విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి ప్లాట్ ఫామ్‌కు నడుస్తున్న రైలుకు మధ్య పడిపోయాడు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు రెండు కాళ్ళు తెగిపోయాయి. ఫ్లెక్సిబుల్ లెగ్స్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దానికోసం ద్వారకా తిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్.సుధాకర్ రావుని సంప్రదించాడు. దీంతో స్పందించిన ఎస్‌వి.సుధాకర్‌రావుతో పాటు మైలవరానికి చెందిన మరికొందరు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

22వ డివిజన్‌లో వైసిపి కార్యక్రమం

ప్రజాశక్తి - విజయవాడ : స్థానిక కృష్ణలంక 22వ డివిజన్‌లోని 109 వార్డు సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ వైఎస్ జగన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి తూర్పు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దేవినేని అవినాష్, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు పాల్గొని కోతమిషన్ రోడ్‌లోని నూతనంగా నిర్మించిన వైసిపి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవినేని మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరలా రావాలని, అందరూ ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని వైసిపి నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణకు ఈ నెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి.నరేష్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇల్లా రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ ఆపైన అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వివరాల కోసం 8247766718, 8074264779 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గిరిజన సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ ఎస్‌టి కార్పొరేషన్ ట్రైకర్ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ తెలిపారు. మళ్లీ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలనే కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఎస్‌టి కార్పొరేషన్ ట్రైకర్ డైరెక్టర్ మద్దిల రామకృష్ణ (ఎంఆర్‌కె) ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామానికి వెళ్లి అక్కడ నివసిస్తున్న గిరిజనులను, పేద, మధ్య తరగతి ప్రజలను శుక్రవారం కలిశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఓటులంక గ్రామం, అమలాపురం టౌన్‌లో గిరిజన ప్రజానీకాన్ని కలుసుకొని అక్కడ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనులు రామకృష్ణను శాలువాతో సత్కరించారు.

7న సభకు తరలి రావాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : రేపటి సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కేశినేని చిన్ని కోరారు. ఈనెల 7వ తేదీ ఆదివారం తిరువూరులో జరగనున్న రా కదలిరా కార్యక్రమాన్ని సమిష్టి కృషితో జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సభ సన్నాహక సమావేశం స్థానిక ఎస్సార్ కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి అధ్యక్షతన జరగ్గా కేశినేని చిన్ని భావోద్వేగంగా ప్రసంగించారు. **వన్‌టౌన్ :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) ఆదేశాల మేరకు టిడిపి నాయకులు ఎంఎస్. బేగ్, టీమ్ టిడిపి ఆధ్వర్యంలో శుక్రవారం టిడిపి పశ్చిమ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లపాటి రాము, శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

రోడ్డు, డ్రైన్ నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి జగ్గయ్యపేట: పట్టణంలోని రోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణంలోని 5వ వార్డులో విజేత స్కూల్‌ను ఆనుకుని ఉన్న రోడ్డు, డ్రైన్ సరిగ్గా లేక స్కూల్ పిల్లలు, కళ్యాణమండపానికి వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారని గడపగడపకు కార్యక్రమంలో సామినేని ఉదయభానుకు దృష్టికి రావడంతో స్పందించినట్లు తెలిపారు. మున్సిపల్ ప్రత్యేక నిధుల సహాయంతో సుమారు రూ.7.50 లక్షలతో ఈ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు వట్టెం మనోహర్, గింజుపల్లి వెంకటరావు, విజేత స్కూల్ ప్రిన్సిపాల్ కొడమల రత్నం, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేసిన రాఘవేంద్ర

నేడు రంగవల్లి పోటీలు

ప్రజాశక్తి - భవానీపురం : సంక్రాంతి పండుగ సందర్భంగా 6న విజయవాడ విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య నగర పాలక సంస్థ (డిఎస్‌సిఎం) ఉన్నత పాఠశాల విద్యార్థులకు రంగవల్లి పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు ముగ్గుల (రంగవల్లుల) పోటీలు జరుగుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు.

12 నుండి బ్యాడ్మింటన్ టోర్నీ


ప్రజాశక్తి - వీరులపాడు : సంక్రాంతిని పురస్కరించుకొని జుజ్జూరులో మేడుకొండూరు హనుమంతరావు మెమోరియల్ షటిల్ డబుల్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 12 నుండి 14 వరకు నియోజకవర్గ స్థాయిలో జరిగే టోర్నమెంట్ పోటీల్లో ప్రథమస్థానం విజేతకు రూ.2వేలు, ద్వితీయ స్థానం రూ.1500, తృతీయ బహుమతి రూ.1వెయ్యి నగదు బహుమతితో పాటు, వ్యక్తిగత ట్రోఫీ, మెడల్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జుజ్జూరు బస్టాండ్ దగ్గర మినీ ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్ట్‌లో జరిగే ఈ టోర్నమెంట్‌కు యారగర్ల రవీంద్ర (9618313913), పత్తిపాటి కిరణ్ కుమార్ (9347443445) లు నిర్వాహకులుగా వ్యవహరి స్తారని పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు తమ జట్టు నమోదుకు రూ.200 చెల్లించాలని 11 లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. టోర్నమెంట్ పోటీలకు ఎవరి కిట్ వారే తెచ్చుకోవాలని, షటిల్ కాక్ కమిటీ వారు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. వచ్చిన ఎంట్రీలను బట్టి, పోటీలు లీగ్, నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. టీమ్ ల డ్రా, మ్యాచ్ ల నిర్వహణ, తుది నిర్ణయం కమిటీ వారిదేనని తెలిపారు.

ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - కంచికచర్ల : పరిటాల పరిధిలో గల అమ్రిత సాయి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఓటు నమోదుపై శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో హాజరైన విశ్రాంత ఉద్యోగి సంఘం అధ్యక్షులు సానె.రామమోహన రావు మాట్లాడారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్. పి చిరంజీవి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఓటు నమోదు ప్రక్రియను విద్యార్థులకు వివరించారు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి జగ్గయ్యపేట : 'సంక్రాంతి ఆటలు యువజన మైత్రికి బాటలు' అనే నినాదంతో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, ఆవాజ్, ఐద్వా, ప్రజానాట్యం మండలి సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గ్రామస్థాయి క్రికెట్ పోటీలను రైతు సంఘం సీనియర్ నాయకులు కాకనబోయిన లింగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగారావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజాసంఘాల



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న కాకనబోయిన లింగారావు

ఆధ్వర్యంలో 40 సంవత్సరాలుగా ఆటల పోటీలు నిర్వహించటం అభినందనీయకమని, ఇటువంటి ఆటల పోటీల వల్ల గ్రామంలో ఐక్యంగా ఉండటంతో పాటు పేకాట, జూదం, కోడిపందాలు వైపు యువత వెళ్లకుండా ఉండుటకు ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎస్.నాగమణి, ఎస్.రామనాదం, కోటా కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, షేక్ గౌస్ మియా, షేక్ బడే మియా, కె శ్రీనివాసరావు, రావెళ్ల శేషు క్రీడాకారులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు వెండి త్రిశూలం సమర్పణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గమ్మ దేవస్థానానికి శ్రీకాకుళం జిల్లా సోంపేట వాస్తవ్యులు ములగాడ విజయలక్ష్మి, చిట్టబ్బాయి (లేట్) కుటుంబ సభ్యులు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావుని శుక్రవారం కలిసి కేజీ బరువు గల వెండి త్రిశూలంను అందజేశారు. సినీ నటి పడాల కళ్యాణి (కరాటే కళ్యాణి) కూడా వీరితో ఉన్నారు. దాతలకు అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం, ప్రసాదం అందజేశారు.



వెండి త్రిశూలంను ఇఓ రామారావుకు ఇస్తున్న దాత కుటుంబం

వర్గపోరుతో వివాదం

పెనుగంచిప్రోలు : మండలంలోని అనిగండ్లపాడులో వైసిపి నాయకులు కార్యకర్తలు మధ్య పరస్పర వర్గ విభేదాలు తలెత్తాయి. వర్గపోరు వల్ల గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్ని రోజులుగా వేర్వేరు సమస్యలు, పరస్పర దూషణలు చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే గ్రామంలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గ్రామ సర్పంచ్ జ్యోతికి చెందిన వరి కోత యంత్రాల లారీకి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి దగ్ధం చేశారు. ఈ ఘటనపై స్థానికుల ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడి చేరుకుని విచారణ చేపట్టారు. సిఐ జానకిరామ్ అనుమానంతో వైసిపి నాయకులు బోశెట్టి త్రినాధ్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీన్ని గ్రామస్తులు అడ్డగించి త్రినాథ్‌కు తామే బుద్ధి చెబుతాం అంటూ పోలీసులపై ఆందోళనకు దిగి బైఠాయించారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు వినియోగించిన ప్రైవేటు



పోలీసులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

కారును ధ్వంసం చేసి సిఐ, జానకిరామ్, ఎస్ఐ దుర్గా ప్రసాద్ సమక్షంలోనే త్రినాథ్‌పై స్థానికులు దాడికి దిగారు. విషయం తెలుసుకున్న డిఎస్‌పి జనార్ధన్ నాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో చర్చించి నిందితుని పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌కి తరలించారు. బందోబస్త్ నిర్వహించి గ్రామంలో 144 సెక్షన్ విధించారు.



అంత్యక్రియల్లో శ్రీరాం, తదితరులు

మాజీ వార్డు కౌన్సిలర్ మృతి

ప్రజాశక్తి జగ్గయ్యపేట : పట్టణానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ వార్డ్ కౌన్సిలర్ బొందిలి బాలాజీ సింగ్ గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. శుక్రవారం ఆయన అంతిమయాత్రలో టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్, ఆయన సోదరులు పాల్గొన్నారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - మైలవరం : రూ.77.5 లక్షలతో రైతు బజారు నిర్మాణం, కొత్త మంగాపురంలో రూ.1 కోటితో రహదారి అభివద్ధి పనులకు శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సమస్యల తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో నిధులను కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు బజారు నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు పలు శాఖాధికారులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలో రూ.69.98 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని పోలీసుల తనిఖీలో భాగంగా బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుండి రూ.69.98 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. 65వ జాతీయ రహదారి గరికపాడు చెక్ పోస్ట్ వద్ద పోలీసులు శుక్రవారం సాధారణ తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా మిర్యాలగూడ వైపు నుండి విజయవాడ వైపు వెళ్తున్న బస్సులో గుడ్లవల్లేరుకు చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు తనిఖీ చేయగా వారి వద్ద భారీ మొత్తంలో నగదును గుర్తించారు. ఆధారాలు లేని ఆ నగదును స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణబాబు తెలిపారు.

టీ షర్ట్‌లు అందజేత

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని వైసిపి కార్యాలయంలో పెండ్యాల వైసిపి నాయకులు, NFC ఫ్రూట్స్ అధినేత నిస్సార్ వితరణతో అందజేసిన టీ షర్టులను కబడ్డీ క్రీడాకారులకు శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం నిస్సార్ భాయ్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ అభినందించారు. **కంచికచర్ల :** కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన కబడ్డీ జట్టు సభ్యులకు దాతలు అందజేసిన టీ షర్టులను ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు, ఎన్ఎఫ్‌సి ఫ్రూట్స్ అధినేత నిస్సార్ కబడ్డీ జట్టు సభ్యులకు టీషర్ట్ లు వితరణ చేశారు.

యుటిఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విస్సన్నపేట : ఈరోజు యుటిఎఫ్ భవన్ విస్సన్నపేటలో యుటిఎఫ్ 2024 వాల్ కేలండర్, స్టిక్కర్ క్యాలెండర్, డైరీలను యుటిఎఫ్ ఉమ్మడి కృష్ణ జిల్లా మాజీ గౌరవ అధ్యక్షులు డి.శ్రీనివాస్ రెడ్డి, ఏలూరు జిల్లా కార్యదర్శి పి.వీరకోటి, యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ విస్సన్నపేట మండల అధ్యక్షుడు కార్యదర్శులు కే చైతన్యడి వెంకట రామయ్య, యుటిఎఫ్‌నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-ఉయ్యూరు: మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.రాజేష్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయం ముందు గత 11 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించి భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పాదయాత్రలో ముఖ్యమంత్రి మున్సిపల్ కార్మికులకు అనేక వాగ్దానాలు చేశారని, గెలిచిన తర్వాత ఇచ్చిన వాగ్దానాల్లో అమలు చేయడంలో పూర్తిగా వెనకబడి ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ కార్మిక సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ నాయకులు చింతయ్య, రామయ్య, బాలకృష్ణ, సుజాత, కమిటీ సభ్యులు శివయ్య, తిలక్, దుర్గమ్మ, మంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ: సిఎం జగన్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న నిరసన ధర్నా శుక్రవారం 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు పొర్లు దండాలు పెడుతూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు ధనాల సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులు పలుమార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తుందని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే 8వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు జి.నారాయణ, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో భిక్షాటన



గుడివాడలో పొర్లుదండాలు

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: ఏ ఆసరా లేని అనాథలను, మరియు పేదవారిని ఆదుకోవడానికి మైత్రీ ఫౌండేషన్‌ను స్థాపించినటు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్థానిక బెల్ ఆడిటోరియలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా అతి తక్కువ కాలంలోనే అనేక సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. సభ్యులు, కుటుంబ సభ్యులు, దాతలు, ప్రజల సహకారంతో ఇప్పటి వరకు 270 సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఫణి కుమార్, కస్తూరి విజయ్, రమాదేవి, సభ్యులు పాల్గొన్నారు.



ప్రజాగ్రహం తట్టుకోలేకే వైసిపిని వీడుతున్నారు : కొనకళ్ల

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రజలను ఎదుర్కొనే ధైర్యం లేక, ప్రజాగ్రహాన్ని తట్టుకోలేక వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపిలు పార్టీని వీడుతున్నారని టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణరావు అన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏపీ అభివృద్ధి పదేళ్లు వెనక్కి నెట్టబడిందని పేర్కొన్నారు. దీంతో ప్రజల నుంచి వస్తున్న నిరసన జ్వాలలకు ఆహుతి కాకముందే వైసీపీని వీడి ఇతర పార్టీలకు మారుతున్నారని తెలిపారు.

టిడిపి కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎంపీటీసీ ప్రమిలా రాణి అన్నారు. బాపులపాడు మండలం పెరికీడు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వసంతవాడ రోడ్డులో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొట్టాపు ప్రవీణ్ కుమార్, పోతల సురేష్, కొత్తూరు రేఖ తదతరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ప్రజాశక్తి-పమిడిముక్కల: కృష్ణాపురం, చోరగుడి, అలినాకిపాలెంలో పోలింగ్ బూత్‌లను పమిడిముక్కల తాసిల్దార్ రాజ్యలక్ష్మి తన బృందంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడంకి, మంటాడ, కపిలేశ్వరపురం గ్రామాల్లో 59 పోలింగ్ బూతులు ఉన్నాయని ఆమె అన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా అవనిగడ్డ మండల సచివాలయం గ్రామస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు అవనిగడ్డలోని అన్నపురెడ్డి సుబ్బారావు ఇండోర్ స్టేడియంలో ఎంపీడీవో ఎం మరియాదేవి ప్రారంభించారు. పోటీలలో ఉత్సాహంగా పాల్గొని మంచి ప్రతిభ కనబరచాలని, మంచి క్రీడాకారులుగా తయారు కావాలని ఆశిస్తున్నట్లు ఎంపీడీవో చెప్పారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం : కలెక్టర్



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కృష్ణా యూనివర్సిటీ ఎన్‌సిసి విభాగం, ఇండియన్ రెడ్‌క్రాస్ సంయుక్త భాగస్వామ్యంలో వన్ మిలియన్ వాలంటీర్స్ ఎన్రోల్మెంట్‌పై సదస్సు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తుందని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో రెడ్‌క్రాస్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. రెడ్ క్రాస్ ఎపి బ్రాంచ్ జనరల్ సెక్రటరీ ఎ.కె.ఫరీదా మాట్లాడుతూ విద్యార్థులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా ముందుకొచ్చి వాలంటీర్స్‌గా చేరాలన్నారు. యూనివర్సిటీ ఉపకులపతి జ్ఞానమని మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సభ్యత్వం పొందటం గొప్ప అర్హతగా విద్యార్థులు భావించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.వీర బ్రాహ్మచారి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.విజయకుమారి, ఎన్‌సిసి విభాగం అధికారి డాక్టర్ డి.రామశేఖరరెడ్డి, ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్స్ మరియు ప్రాజెక్ట్స్ సమన్వయకర్త కుమార్, కృష్ణాజిల్లా చైర్మన్ బాలాజీ పాల్గొన్నారు.

వెల్దిపాడులో పల్లెకు పోదాం

ప్రజాశక్తి-ఉంగుటూరు: నవరత్నాల వల్ల రాష్ట్ర ప్రజానీకం సుభిక్షంగా ఉన్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షులు కె.చంద్రశేఖరరావు అన్నారు. శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం వెల్దిపాడు సర్పంచ్ లాం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవినీతిరహిత పాలన అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గుడిసె బాలస్వామి, వెన్నూతుల, నాగవరప్పాడు, తుట్టగుంట సర్పంచులు టీవీ రామ్మోహనరావు, షేక్ పెద్ద నాగూర్, బి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

10 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-మొవ్వ: ఈ నెల 10వ తేదీ మొవ్వ శ్రీ మండల కనకయ్య జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించే మండల స్థాయి ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సమాయత్తమవ్వాలని ఎండిఓ జి సుధాప్రవీణ్ సూచించారు. మొవ్వ ఎండిఓ కార్యాలయంలో శుక్రవారం పి.డీలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి పది నుంచి 23వ తారీకు వరకు జరిగే పోటీలను ఏ విధమైన వివాదాలు లేకుండా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీలు ఏ రామారావు, ఎం మనోహరి, బి నాగ శివ, పి బసవయ్య, పీఈటి వర్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి

ప్రజాశక్తి-గుడివాడ రూరల్

ఆటో-లారీ ఢీకొన్న ఘటనలో గాయపడిన అర్లగడ్డ కృపా (18) శుక్రవారం ఉదయం మృతిచెందింది. గత నెల 31న బాబాయ్‌కి ప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో గృహం చూడటానికి ఆమె వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురైంది. ఆమెను విజయవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గుడివాడ మండలం శేరిగొల్వేపల్లి గ్రామం నుంచి కుటుంబం వలస వచ్చి గుడివాడ దగ్గర నాగవరప్పాడు వద్ద అద్దెకు ఉంటోంది. ముగ్గురు ఆడ పిల్లలో ఆమె మొదటి సంతానం. గుడివాడలోని ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీలో మొదటి సంవత్సరం విద్య నభ్యసిస్తుంది. తండ్రి కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. గ్రామీణ ఎస్ఐ లక్ష్మినారాయణ లారీ డ్రైవర్ నరసరావుపై కేసు నమోదు చేశారు.

ఉషారామలో టెక్నో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉంగుటూరు: విద్యార్థులు టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవడానికి ఫెస్ట్‌లు ఎంతగానో దోహదపడతాయని ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ అయ్యర్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని ఉషారామ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయస్థాయి టెక్నో కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువతలో సృజనాత్మకత బయట పడుతుందన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు లాంటి వాటి వల్ల యువత చెడు మార్గాలను అనుసరించకుండా లక్ష్యం వైపు ముందుకు సాగడానికి భవిష్యత్తును నిర్దేశించుకోవడానికి దోహదపడతాయన్నారు. టెక్ మహీంద్రా డెలివరీ హెడ్ అండ్ ఆపరేషన్స్ కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత టెక్నికల్ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా రాణించడానికి తన వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకోవడం కీలకమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.కె.ఎస్.వి.ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్ర నలుమూలల నుండి 3,200 మంది విద్యార్థులు ఫెస్ట్‌కు హాజరయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె రాజశేఖర్, చైర్మన్ రామబ్రహ్మం, లంకా అరుణ్ పాల్గొన్నారు.



రబీ పంటల నమోదు సత్వరం చేయాలి : ఎడిఎ

ప్రజాశక్తి-మొవ్వ: రబీ సీజన్లో సాగు చేసిన పంటల వివరాలను పూర్తి వివరాలతో నమోదు చేయాలని సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్ శ్యామల ఆదేశించారు. మొవ్వ మండలం పెదపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సచివాలయ వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. సచివాలయ పరిధిలోని విస్తీర్ణంలో అధిక శాతం మొక్కజొన్నతో పాటు ఎల్బీజీ 752 రకం మినుము, తీగ మినుము సాగు చేసినట్లు వివరాలు సేకరించారు. ఖరీఫ్‌లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె సూచించారు. అలాగే ఈకేవైసీ కూడా రైతులు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఎం.శ్రావణి, సలహా సంఘం మండల అధ్యక్షులు తాతా రాంబాబు, కోరుకొండ వెంకటేశ్వరరావు, పులి రాజబాబు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-అవనిగడ్డ: జిల్లా ఎస్పీ పి జాషువా ఆదేశాల మేరకు డిఎస్పి వి మురళీధర్ ఆధ్వర్యంలో పులిగడ్డ టోల్ ప్లాజా వద్ద అవనిగడ్డ సీఐ ఎల్ రమేష్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఒక కారులో రెండు లక్షల నాలుగు వేల రూపాయలు నగదు కనిపించగా నగదుపై కారులో ఉన్నవారు డబ్బులకు సంబంధించి సరైన సమాధానం చెప్పడంతో ఆ నగదు స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్ తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు రిషిక ఎంపిక

ప్రజాశక్తి-అవనిగడ్డ: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎస్వీఎల్ క్రాంతి కళాశాల విద్యార్థిని కోపనాతి రిషిక ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు తెలిపారు. గురువారం కళాశాల వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెలలో ఒంగోలులో జరిగిన అండర్ 17 విభాగంలో తమ కళాశాలలో సీఈసీ చదువుతున్న రషిత అత్యంత ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ బాలిక ఈనెల 10వ తేదీన రాజస్థాన్లో జరగబోయే జాతీయస్థాయి పోటీలలో పాల్గొనబోతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆ క్రీడాకారిని కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ప్రిన్సిపాల్ ఎన్వి నాగేశ్వరరావు అభినందించారు.

అవనిగడ్డలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ ఏడో వార్డులో టిడిపి ఆధ్వర్యంలో బాబూ షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్‌రామ్ టిడిపి పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, తెలుగు మహిళా అధ్యక్షురాలు బండే కనకదుర్గ పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.1.03 కోట్లు

ప్రజాశక్తి-మోపిదేవి: సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రంగా వెలుగొందుతున్న మోపిదేవి దేవస్థానంలో ఆలయ కమిషనర్ సూర్య చక్రధరరావు పర్యవేక్షణలో శుక్రవారం హుండీ లెక్కింపు చేపట్టారు. 95 రోజులకు రూ.1,03,83,725 నగదు, వెండి 4.7 కిలోలు, బంగారం 90 గ్రాములు, అమెరికా డాలర్స్ -219, అరబ్ దిరామ్స్-10, ఆస్ట్రేలియా డాలర్స్-10, సింగపూర్ డాలర్స్-14, ఇంగ్లాండ్ పౌండ్స్-15, శ్రీలంక కరెన్సీ 240 రూపాయలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, కృష్ణాజిల్లా దేవాదాయ శాఖ తనిఖీ అధికారి శ్రీనివాసరావు, కోడూరు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణ అధికారి సిహెచ్.సుధాకర్‌రావు పర్యవేక్షించారు.

టిడిపి రాష్ట్ర పరిశీలకుడిగా రమేష్

జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకుడు గింజుపల్లి రమేష్‌ను టిడిపి రాష్ట్ర పరిశీలకుడిగా రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. ఈ సందర్భంగా తన నియామకాన్ని ఆమోదించిన వారందరికీ ఆయన రమేష్ ధన్యవాదాలు తెలిపారు.

30 మందికి నూతన పెన్షన్లు పంపిణీ



పెన్షన్లు పంపిణీ చేసిన కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్లో వైఎస్ఆర్ పెన్షన్ కానుక నూతన పెన్షన్లను శుక్రవారం 51వ డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ మరుపిళ్ళ రాజేష్ కొత్త పెన్షన్ దారులకు రూ. 3 వేలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మరుపిళ్ళ రాజేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రతి పథకాన్ని అందిస్తున్నారని తెలిపారు. 51 డివిజన్లో కొత్తగా మంజూరైన 30 మందికి పెన్షన్లు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, వైఎస్ఆర్సిపి నాయకులు, సచివాలయం సెక్రటరీలు, వాలంటరీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మట్టా జోబ్‌కి నివాళి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ నగర కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మట్టా జోబ్ రత్నకుమార్ మృతి తీరని లోటని వైసిపి రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం కెఎల్.రావు నగర్‌లోని మట్టా రత్నకుమార్ ఇంటివద్ద ఆయన భౌతికకాయాన్ని ఆకుల శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. రత్నకుమార్ కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు. ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ మట్టా జోబ్ రత్నకుమార్ విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న సమయంలో తాను సిటీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆయనతోపాటు కలిసి సుదీర్ఘకాలం పనిచేశానని అన్నారు. రాజకీయపరంగా రత్నకుమార్ తనకు ఎన్నో విలువైన సలహాలిచ్చేవారని గుర్తు చేసుకున్నారు. రత్నకుమార్‌కు నివాళులర్పించిన వారిలో పొదిలి చంటిబాబు, అల్లంపూర్ణ , మేళం చిన్న, యరజర్ల మురళి తదితరులు ఉన్నారు.

ఆటో బోల్తా : మహిళలకు గాయాలు



మహిళలను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పేరకల పాడు సమీపంలో ఆటో బోల్తాపడటంతో 10 మంది వ్యవసాయ కూలీలకు గాయాల య్యాయి. సేకరించిన సమాచారం మేరకు పేరకలపాడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు శుక్రవారం కీసర సమీపంలో మిర్చి కోతకు వెళ్లి సాయంత్రం ఆటోలో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. పేరకలపాడు సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో గాయపడిన 10 మంది మహిళలను చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. స్వయంగా ఎమ్మెల్యే వైద్య సేవలందించారు. మెరుగైన వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

ఇగ్నో సెషన్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో 2024 జనవరి నుంచి ప్రారంభమయ్యే విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, డిగ్రీ ఆనర్స్, పీ.జీ. డిప్లొమా, డిప్లొమా మరియు సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డా.కె.సుమలత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సీఏ కోర్స్ చదువుతున్న విద్యార్థులకు ఇగ్నో నిర్వహించే ప్రత్యేక బి.కాం, ఎంకామ్ కోర్సులకు కూడా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఆఖరు తేదీ 31 జనవరి, 2024 అని తెలిపారు. పీ.జి రెండో సంవత్సరం, డిగ్రీ రెండో, మూడో సంవత్సరం, సెమిస్టర్ విధానంలో చదివే విద్యార్థులు రీ-రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్లైన్ ద్వారా జనవరి 29వ తేదీ వరకు చెల్లించొచ్చని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు బి.ఏ, బి.కాం డిగ్రీ కోర్సులకు ఫీజు మినహాయింపుతో ఆన్లైన్ ద్వారా కొత్త అడ్మిషన్, రీ-రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు ఇగ్నో వెబ్ సైట్‌ని గానీ లేదా కొత్తపేటలోని హిందూ హైస్కూల్ ప్రాంగణంలో గల ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా గానీ లేదా 0866-2565253 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించొచ్చని తెలిపారు.

అంగన్వాడీల సమ్మెకు పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి - విజయవాడ : అంగన్‌వాడీల సమ్మె 24వ రోజు చేరిన సందర్భంగా 24 గంటల రాష్ట్ర స్థాయి దీక్షలను శుక్రవారం ఆల్ ఇండియా అంగన్‌వాడీ వర్కర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎఆర్ సింధు ధర్నా చౌక్‌లో ప్రారంభించారు. దీక్షల్లో కూర్చునే వారి మెడల్లో పూల దండలు వేసి సింధు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) యూనియన్ నేతలతో పాటు ఎఐటియుసి, ఐఎఫ్‌టియుకు చెందిన ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల నేతలు, కార్యకర్తలు ఈ దీక్షల్లో కూర్చున్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బేబిరాణి అధ్యక్షత వహించారు. ఎఆర్ సింధు మాట్లాడుతూ అంగన్‌వాడీల సంక్షేమం కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సైతం కేంద్రంలోని మోడీ, ఆంధ్రప్రదేశ్‌లోని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేయడం లేదని, ఇది కోర్టు ధిక్కరణ అవుతుందని అన్నారు. 2018 తరువాత అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచలేదని దుయ్యబట్టారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ.. నిర్బంధాలకు, అరెస్టులకు, కేసులకు అంగన్‌వాడీలు భయపడే వారు కాదని, ఇటువంటి ప్రభుత్వాలను అంగన్‌వాడీలు అనేకం చూశారని అన్నారు. అంగన్‌వాడీల ఉద్యమానికి అండగా సిఐటియు, ఎఐటియుసి, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఇతర కార్మిక సంఘాలు అన్ని సంపూర్ణ మద్దతునిస్తున్నాయని అన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ... అంగన్‌వాడీల ఉద్యమానికి ఎఐటియుసి, ఇతర కార్మిక సంఘాలు మొత్తం అండగా ఉన్నాయన్నారు. ఐఎఫ్‌టియు నాయకులు రవిచంద్ర, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ...అంగన్‌వాడీలు తప్పక విజయం సాధిస్తారని అన్నారు. గ్రామాల్లో సదరు లబ్దిదారులను ఐద్వా, ఇతర సంఘాల ద్వారా అవగాహన కల్పించి, అంగన్‌వాడీ ఉద్యమానికి తోడుగా ఉండటానికి ఐద్వా బాధ్యత తీసుకుంటుందని అన్నారు. ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు అంగన్‌వాడీల ఉద్యమానికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ తదితర ఇతర నాయకులు పాల్గొన్నారు. **నందిగామ :** సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వి .రవిశేఖర్,జంగా దమోదర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ సీనియర్ నందిగామ ప్రాజెక్టు కార్యదర్శి కోల్లి సరళ , మహాలక్ష్మి, వెంకట్రావమ్మ, సుజాత, వేణు, పిచ్చిమ్మ పాల్గొన్నారు. **మైలవరం :** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు 25 నెంబర్ ఆకారంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్ మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి రావూరి రమేష్ బాబు ఈ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు శారద, పుష్ప కుమారి, మైలవరం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీలు, అంగన్వాడి హెల్పర్లు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** జగ్గయ్యపేటలో కొనసాగుతున్న సమ్మెలో అంగన్వాడీలు నినాదాలు చేశారు. వీరికి మున్సిపల్ వర్కర్లు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోటా కష్ణ, రావెళ్ల శేషు, మున్సిపల్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** అంగన్వాడీ కార్యకర్తల, ఆయాల సమ్మె యధావిధిగా కొనసాగుతుంది. తిరువూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద చేస్తున్న ఆందోళనకు సిపిఎం ఎ.కొండూరు మండల నాయకులు పానెం ఆనందరావు, ఆళ్ల అమ్మిరెడ్డి సంఘీభావం తెలిపారు.



విజయవాడలో



జగ్గయ్యపేటలో



తిరువూరులో



నందిగామ



మైలవరం

పొర్లుదండాలతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - విజయవాడ : మునిసిపల్ కార్మికుల సమ్మె 11వ రోజుకు చేరింది. విజయవాడ లెనిన్ సెంటర్‌లో పొర్లుదండాలు పెడుతూ కార్మికులు వినూత్న రీతిలో శుక్రవారం పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం అక్కడ నుంచి బ్యానర్లు, జెండాలు చేబూని భారీ ర్యాలీగా కార్మికులు ధర్నా చౌక్‌కు చేరి, ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్ అధ్యక్షత వహించారు. సమ్మెనుద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ...మునిసిపల్ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిఐటియు అన్ని రకాలుగా అండదండలిస్తుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ. .ప్రస్తుతం కరోనా కేసులు పెరుగుతున్న తరుణంలో ప్రభుత్వం మునిసిపల్ కార్మికుల పట్ల మొండిగా వ్యవహరించడం సరైందని కాదని అన్నారు. రాష్ట్రంలో పారిశుధ్యం అధ్వాన్నంగా మారిందన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాధ్ మాట్లాడుతూ...మునిసిపల్ కార్మికులు గత 11 రోజుల నుంచి చేస్తున్న వీరోచిత పోరాటాన్ని గుర్తించి, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.తిరుపతమ్మ, గార్లపాటి లక్ష్మీ, మార్తమ్మ, విజయలక్ష్మి, కృష్ణవేణి, మహేష్, నరేంద్ర, బ్రహ్మయ్య, జయరావు, దుర్గారావు, సాంబులు, బుజ్జమ్మ, కుమారి, వీరబాబు, టి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 11వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం పొర్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నంలో పవిత్ర సంగమంలో జల దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బి అప్పారావు, టీ సూరిబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. జల దీక్షలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు భోజనం వసతులు ఏర్పాటు

మున్సిపాలిటీలో ఏడు రోజులుగా మున్సిపల్ కార్మికులు చేస్తున్న నిరసనకు సంఘీభావం తెలిపి, కౌన్సిలర్ ధరణికోట విజయలక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొండపల్లి మున్సిపల్ కార్మికులకు భోజనం వసతులు ఏర్పాటు చేశారు. టిడిపి తమకు అండగా నిలబడుతుందని అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, కౌన్సిలర్ మైల మహాలక్ష్మి, మైలవరం నియోజవర్గం జనసేన ఇన్‌ఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), నాయకులు మద్దతు పలికారు. **నందిగామ :** నందిగామలో మున్సిపల్ కార్మికులు సమ్మె 11వ రోజు నందిగామలో జరుగుతుంది. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా పోటీ కార్మికులను పెట్టి మున్సిపల్ కార్మికులు చేసే సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం చూస్తోంది. కార్మికులు ఒకపక్క సమ్మె చేస్తుంటే పోటీ కార్మికులను పెట్టి కార్మికుల చేత పనిచేయటం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నందిగామ కమిటీ కార్యదర్శి. దసవరపు సైదా, అధ్యక్షుడు సలికేటి నరేష్, కార్మికులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని మున్సిపల్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శుక్రవారం 11వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు సిఐటియుసి, ఎఐటియుసి ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియుసి, ఎఐటియుసి నాయకులు కోటా కష్ణ, రావేళ్ళ శేషు, ఎ.శివాజీ, పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరులో నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పటుచేసిన సమ్మె శిబిరం వద్ద పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు మోదుగు సురేష్, మారిపోగు నాగరాజు, చేపల మడుగు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో



జగ్గయ్యపేటలో



నందిగామ



తిరువూరులో


మచిలీపట్నంలో...


గుడివాడలో...


అవనిగడ్డలో...

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా డిమాండ్స్ పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు కె.లక్ష్మి స్పష్టం చేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయమని ఇప్పటి వరకు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం బెదిరింపు ధోరణికి దిగడం శోచనీయమన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.గోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వ బెదిరింపులకు ఎవరు బయపడొద్దని అంగన్వాడి కార్యకర్తలందరికీ సిఐటియు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, మండల కార్యదర్శి సిహెచ్ జయరావు, సుజాత, అంజలి, గిరిజా, విజయశ్రీ, స్వాతి, రత్నకుమారి పాల్గొన్నారు. **బంటుమిల్లి:** అంగన్‌వాడీలు బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. పాదచారులకు, వాహనదారులకు పూలు ఇచ్చి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ధనశ్రీ బాజీ పాల్గొన్నారు. **గుడివాడ రూరల్:** గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం అంగన్‌వాడిల సమస్యలపై స్పందిచకపోవడం శోచనీయమని సిపిఎం డివిజన్ కార్యదర్శి అర్‌సిపి రెడ్డి పేర్కొన్నారు. ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడిలు చేస్తున్న సమ్మె శుక్రవారం రిలే నిరహార దీక్షలుగా మారాయి. అంగన్‌వాడిలను తొలగించామని ట్యాబ్‌లు సిడిపివోకు అప్పచెప్పి విధుల నుంచి తప్పుకోమనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అంగన్‌వాడిలను విధుల నుంచి తొలగించినా ఎట్టి పరిస్థితిల్లోను సమ్మె విరమించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు సిపిఎం కార్యదర్శి బివి శ్రీనివాస్, ఐద్వా నాయకురాలు రజని, అంగన్‌వాడి యూనియన్ అధ్యక్షురాలు యెండూరి గీత, కార్యదర్శి తూమేటి వాణి పాల్గొన్నారు. **కంకిపాడు:** కంకిపాడులో అంగన్‌వాడీలు సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు రేవతి, నళినికుమారి, రమాదేవి, సిహెచ్ విజయలక్ష్మి, ఎం కనకరత్నం, కాళిమ్మ, తాడంకి నరేష్ పాల్గొన్నారు. **మొవ్వ:** అంగన్‌వాడీలకు కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు, సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, సీఐటీయూ నాయకులు కరీముల్లా సంఘీభావం తెలిపారు. మొవ్వ సిడిపిఓ భానుమతి దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలతో చర్చలు జరిపి జిల్లా కలెక్టర్ ఆదేశాలను వివరించి విధుల్లో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొవ్వ ప్రాజెక్టు కార్యదర్శి రాజారత్నం, కోశాధికారి గంగాభవాని పాల్గొన్నారు. **అవనిగడ్డ:** అవనిగడ్డ ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు రిలే దీక్షలతో నిరసనలు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి ఆదిశేషు, ధోనే సహదేవుడు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిర్మల, జ్యోతి, ఎ.నాగమణి, పాములమ్మ, గాదె సుశీల పాల్గొన్నారు. **పామర్రు:** పామర్రులో సమ్మె శిబిరం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి మెమోరండం ఇచ్చారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే రంగారావు, అంగన్వాడీ జిల్లా మాజీ అధ్యక్షురాలు పద్మ, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి మర్రాపు పోలినాయుడు, బహుజన సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షులు పెగ్గెం ప్రసాద్, రాయవరపు బాబు రాజేంద్రప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు ఉమారాణి, నాయకులు రత్నశ్రీ, పద్మ, వాణి, గంగాధర్, విల్సన్ పాల్గొన్నారు.


బంటుమిల్లిలో...


కంకిపాడులో...


మొవ్వలో...


పామర్రులో...

'డప్పు కళాకారులకు రూ.5 వేలు ఇవ్వాలి'

ప్రజాశక్తి-ఉంగుటూరు: డప్పు కళాకారులకు కనీస పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేటి మురళి కోరారు. మండలంలోని డప్పు కళాకారులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డి ఎండి బాషాకు వినతిపత్రాన్ని అందజేశారు. కొత్తగా పెన్షన్ కోసం నమోదు చేసుకున్న వారికి ఫిబ్రవరి మాసం నుండి అమలు చేసి ఐదు వేల రూపాయలు ఇప్పించాలని, అదేవిధంగా గజ్జలు, డప్పులు కళాకారులకు యూనిఫాం, చర్మకారులకు దానికి అవసరమైన సామాగ్రి అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, భాస్కర్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వంద మందికి అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవనంలో వల్లభనేని వీరభద్రరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో ట్రై సైకిల్, స్టీల్ ప్లేట్లు, వంద మందికి అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ కొసరాజు బాపయ్యచౌదరి, వైపిసి ప్రసాద్, లయన్ వెంకటసుబ్బారావు చౌదరి, చాపరాల బాలాజీ, రాజా, పొట్లూరి రవి, జంగం మోహన్ రావు, పరంధామయ్య పాల్గొన్నారు.

కొండాలమ్మను దర్శించుకున్న జెసిలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కొండాలమ్మ అమ్మవారిని కృష్ణాజిల్లా పూర్వ, నూతన జాయింట్ కలెక్టర్లు అపరాజితాసింగ్, గీతాంజలి శర్మ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అధికారులు వారికి స్వాగతం పలికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో పి పద్మావతి, తాసిల్దార్ అబ్దుల్ రహమాన్ మస్తానా, ధర్మకర్తల మండలం చైర్మన్ శేషం వీర వెంకట కృష్ణమూర్తి పాల్గొన్నట్లు దేవస్థాన కార్యనిర్వాహణాధికారి కానూరు సురేష్‌బాబు తెలిపారు.



కెడిసిసి బ్యాంకు నూతన భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న కొడాలి నాని, హారిక, పద్మావతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ గుడ్లవల్లేరు బ్రాంచ్ నూతన భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కొడాలి నాని ప్రారంభించారు. జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక బ్యాంక్ ఇతర విభాగాలు ప్రారంభించగా, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాని మాట్లాడుతూ రూ.16 వేల కోట్ల వృద్ధితో కేడీసీసీ బ్యాంక్ రాష్ట్రంలోనే ముందు వరసలో నిలవడం బ్యాంక్ కమిటీ సభ్యుల పనితీరుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, బ్యాంకు పర్సన్ ఇంచార్జ్ కమిటీ సభ్యులు పడమటి సుజాత, కొమ్మినేని రవిశంకర్, రవీంద్ర రానా, తలుపుల వెంకట కృష్ణారావు, వెంకయ్య, భూక్యరాణి, మండల వైసీపీ కన్వీనర్ సాయన రవి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పెన్నేరు ప్రభాకర్, శ్రీ కొండలమ్మ దేవస్థానం ధర్మకర్తల కమిటీ చైర్మన్ శేషం గోపి, వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి పనులు ప్రారంభం

గుడ్లవల్లేరు జగనన్న కాలనీలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.1.64 కోట్లతో చేపట్టనున్న ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొడాలి నాని శుక్రవారం ప్రారంభించారు. తొలుత కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే కొడాలి నానికు కాలనీ నివాసితులు స్వాగతం పలికారు. నాని మాట్లాడుతూ తాగునీటి వసతితో పాటు కాలనీలో ప్రజల జీవనానికి ఇబ్బందులేకుండా అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పవన్ కళ్యాణ్‌ను వెనకాల పెట్టుకొని తిరుగుతున్న చంద్రబాబు బీసీలు తన వెన్నెముక్క అని ఎలా చెబుతారని ప్రశ్నించారు. బీసీల కోసం చంద్రబాబు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్, విజయవాడ మేయర్ పదవులను బీసీలకు ఇవ్వడమే జగన్ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం: యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. శుక్రవారం సూరంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వంశీ సహకారంతో యంగ్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను వైఎస్ఆర్సిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రవి.. క్రీడల అభివద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. యువకులు చదువుతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కబడ్డీ క్రికెట్ వంటి క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. తోట వెంకయ్య మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న యంగ్ బాయ్స్‌ను అభినందించారు. ఎంతో క్రమశిక్షణతో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించి వేలాది రూపాయలను బహుమతులుగా అందించి క్రీడాకారులను ప్రోత్సహించడం మంచి సంప్రదాయమన్నారు. ఆటల పోటీలకు తన వంతు సహకారం ఉంటుందన్నారు.



7న హాకీ కృష్ణాజిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కృష్ణాజిల్లా జానియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక ఈ నెల 7వ తేదీన ఆదివారం మచిలీపట్నం నోబుల్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా హాకీ సంఘం ముఖ్య కార్యదర్శి శ్రవణం హరికృష్ణ తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 9 నుండి 12 వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7013786846 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ముగిసిన పైడమ్మ తల్లి జాతర

ప్రజాశక్తి-పెడన: పట్టణ గ్రామ దేవత శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. 11 రోజుల పాటు జరిగిన ఈ జాతరలో వేలాది మంది పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. సిరి బండ్లు, మేళ తాళాలు, డప్పు వాయిద్యాలు నడుమ అమ్మవారి, పోతురాజుల ప్రతిమలను పురవీధుల్లో ఊరేగించుకుంటూ ఆలయానికి తీసుకెళ్లారు. శుక్రవారం చివరి రోజు కావడంతో ఆలయం వద్ద ఉన్న పైడమ్మ అమ్మవారి ప్రతిమను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీరవెంకటమోహన్‌రావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ నెల 12వ తేదీన శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్త దాసు వాసునందన్‌రావు సేవలు మరువలేనివన్నారు.



సాంకేతిక విద్యలో వృత్తి నైపుణ్యత అవసరం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: స్థానిక కృష్ణా యూనివర్సిటీలో శుక్రవారం అవేర్నెస్ ఆన్ ప్రొఫెషనల్ బాడీస్ అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కావల్సిన అన్ని అనుమతులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి అందజేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ డా.వీర బ్రహ్మాచారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ సాంకేతిక విద్యా విధానంలో వృత్తి తాలూకు నైపుణ్యత, ఉద్యోగ బాధ్యత విషయంలో ఇలాంటి అవగాహనా సదస్సులకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ఢిల్లీలోని ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ నుండి విచ్చేసిన జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు టిఎస్ఎస్ బాలాజీ మాట్లాడుతూ కొంతమంది ప్రొఫెషనల్స్ యొక్క ఆలోచనా విధానాలను, భావజాలాన్ని ఏ విధంగా ఈ సాంకేతిక విద్యకు ఉపయోగించుకుని మరింత బలోపేతం చేసుకోవచ్చో వివరించారు. ఈ కార్యక్రమానికి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయ్ కుమరి సమన్వయకర్తగా వ్యవహరించారు.





నూరు శాతం సంతృప్త స్థాయిలో పథకాల అమలు

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : నూటికి నూరు శాతం సంతృప్త స్థాయిలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు-ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలకు అర్హత ఉండి నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోలేకపోవడం, బ్యాంకు ఖాతా వివరాలు సరిగా లేకపోవడం తదితర కారణాల వల్ల మిగిలిపోయిన వారికి నవరత్నాలు-ద్వై వార్షిక నగదు మంజూరు కార్యక్రమం ద్వారా లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా కలెక్టర్ ఎస్.డిల్లీరావు.. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదును జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం కలెక్టర్ డిల్లీరావు.. ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి పథకాల లబ్ధిదారులు, విద్యార్థులకు రూ. 4.37 కోట్ల మెగా చెక్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఈ విడతలో ద్వై వార్షిక నగదు మంజూరు కింద జగనన్న అమ్మ ఒడి, వైఎస్ఆర్ కాపునేస్తం, వైఎస్ఆర్ వాహనమిత్ర తదితర పథకాలకు సంబంధించి 2,934 మంది లబ్ధిదారులకు రూ. 4.37 కోట్ల మేర లబ్ధి చేకూరుతోందని కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అత్యంత పారదర్శకత, జవాబుదారీతనంతో అర్హులందరికీ సంతప్తికర స్థాయిలో పథకాలు అందించడం జరుగుతోందని కలెక్టర్ డిల్లీరావు తెలిపారు.

జన్‌మన్‌తో గిరిజనుల జీవితాలకు భరోసా

అధికారులకు కలెక్టర్ డిల్లీరావు ఆదేశాలు

ప్రజాశక్తి - విజయవాడ : కొండ సవరలు, కొండ రెడ్డి, కుటియా ఖోండ్ తదితర 11 ఎస్‌టీ ఉప వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్) పథకాన్ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు సమన్వయ శాఖల అధికారులు కషిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు. పీఎం జన్‌మన్ పథకం ద్వారా బలహీన గిరిజన వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చి వారిని అభివద్ధి దిశగా నడిపించే క్రమంలో అధికారులకు మార్గనిర్దేశనం చేసేందుకు కలెక్టర్ డిల్లీరావు.. గిరిజన సంక్షేమ అధికారి జె.సునీతతో కలిసి మండల ప్రజాపరిషత్ అభివద్ధి అధికారులతో శుక్రవారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ కొండ సవరలు, కొండ రెడ్డి, కుటియా ఖోండ్, డోంగ్రియా ఖోండ్, చెంచు, బోడో గదబ, గుటోబ్ గదబ, పరేంజి పోర్జా, ఖోండ్ పోర్జా, బోండో పోర్జా, కోలమ్ గిరిజన వర్గాల (పీవీటీజీ) ప్రజలు, వారి స్థితిగతులకు సంబంధించి ఎంపీడీవోలు సమగ్ర సమాచారంతో నివేదికలు అందించాలన్నారు. నిర్దేశ ప్రొఫార్మాలో వివరాలు పొందుపరచాలన్నారు. 11 గిరిజన వర్గాల ప్రజలకు సొంతిల్లు, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, ఆరోగ్యం, పోషణ, టెలికం అనుసంధానం తదితర ముఖ్యమైన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. అదే విధంగా ఆయా వర్గాల ఆవాసాలను రహదారులతో అనుసంధానించేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ గిరిజన ఉప వర్గాల ప్రజలకు సుస్థిర జీవనోపాధి అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. గిరిజనుల సంక్షేమం లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున అమలుచేస్తున్న కార్యక్రమాల ఫలాలు వారికి అందేలా చూడాలని.. పథకాలను సద్వినియోగం చేసుకొని ఎదిగేందుకు దారిచూపాలన్నారు.



అధికారులతో వర్చువల్‌గా మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన డిటిడబ్ల్యుఒ సునీత

పారిశుద్ధ్యం మెరుగుదలలో లోపాలు లేకుండా చర్యలు

విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశం



కృష్ణవేణి ఘాట్‌లో గుట్టలుగా ఉన్న భవానీ దీక్ష విరమణ బట్టలను తొలగింపుచేస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ : భవానీ దీక్షల విరమణ సమయంలో వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఘాట్స్ ఏరియాలోని శానిటేషన్, భవానీల రద్దీ, అక్కడ సదుపాయలను కమిషనర్ శుక్రవారం పరిశీలించారు. అధికారులకు పలుసూచలు, ఆదేశాలిచ్చారు. ఘాట్ల వద్ద నిరంతరం మెషిన్లను వాడి భక్తులు విడిచిపెట్టే బట్టలను త్వరగా శుభ్రపరచాలని కమిషనర్ ఆదేశించారు. భవానీదీక్ష విరమణ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి నగరాన్ని వచ్చు యాత్రికులకు కల్పించిన వసతులను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగుకుండా చూడాలని, భవాని దీక్ష విరుముళ సమయం లో భక్తులు వదిలేసే వస్త్రాలను ఘట్ వద్ద నిరంతరంగా కన్వేయర్ బెల్ట్ ద్వార సేవలు ఉంచాలని, ఎక్కువగా మెషిన్లను వాడి పరిశుభ్రతను పాటించాలని చీఫ్ ఇంజనీర్ ఎం ప్రభాకర్ రావుని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి భక్తులకు కల్పించిన సదుపాయాలను పర్యవేక్షించి అధికారులను వివరాలు అడిగితెలుసుకొని పలు ఆదేశాలు ఇచ్చారు. యాత్రికులకు అందుబాటులో ఉంచిన తాత్కాలిక మరుగుదొడ్లు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ పర్యటనలో కమీషనర్ తో పాటు చీఫ్ ఇంజనీర్ యం ప్రభాకర్ రావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పి. రత్నావళి, హెల్త్ ఆఫీసర్-3 ఇక్బాల్ హుస్సేన్, శానిటరీ ఇన్స్ పెక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా గంజాయి అక్రమ రవాణా

భారీ స్థాయిలో కేసులు నమోదు, సరుకు స్వాధీనం

2022 కంటే 2023లో అధికంగా 168 కేసులు

తిరువూరులోనే 4వేల 100 గ్రాముల పొట్లాలు సీజ్

యువత, కాలేజీ కుర్రోళ్లే లక్ష్యంగా చీకటి వ్యాపారం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్టీఆర్ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా పెరిగింది. యువత, కళాశాలల విద్యార్థులే లక్ష్యంగా అక్రమ వ్యాపారం సాగుతోంది. 2022తో పోలిస్తే 2023లో గంజాయి కేసులు భారీగా పెరిగాయి. దాదాపు 168 కేసులు అధికంగా నమోదయ్యాయి. 2021 కంటే 126 కేసులు ఎక్కువుగా నమోదయ్యాయి. ఈ కేసుల్లో గంజాయిని కూడా అధిక మొత్తంలోనే స్వాధీనం చేసుకున్నారు. 2023 జూలైలో తిరువూరులో గంజాయి ముఠా గుట్టురట్టయింది. దాదాపు 4,100 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 11 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కళాశాలల విద్యార్థులు, యువతే లక్ష్యంగా కొన్ని ముఠాలు గంజాయి వ్యాపారం సాగుతున్నట్లు గుర్తించారు. గత మాసంలో జగ్గయ్యపేట నుండి తిరుపతి వెళుతున్న ఆర్‌టిసి బస్సులో సుమారు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్‌లో మైలవరంలో పోలీసులు మరో ముఠాను రట్టు చేశారు. దాదాపు 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం నుంచి హర్యానాకు కంటెయినర్ ద్వారా తరలిస్తున్న సుమారు 250 కిలోల గంజాయిని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల పోలీసులు కీసర టోల్‌ప్లాజా వద్ద స్వాధీనం చేసుకున్నారు. గతేడాది మార్చిలో ఇబ్రహీంపట్నంలో జరిగిన ఓ పుట్టిన రోజు వేడుకల్లో కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జూలైలో మైలవరం, జి.కొండూరు మండలాల్లో 2.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు 8 మందిని అరెస్టు చేశారు. గంజాయి అక్రమ రవాణాపై చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో 2023 జనవరి నుంచి జూన్ వరకు ఆరుమాసాల కాలంలో 123 గంజాయి కేసులు నమోదు చేయగా, 314 మందిని అరెస్టు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా వెల్లడించారు. సుమారు 8 మందిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టినట్లు చెప్పారు. ఇలా 2023లో మొత్తం 271 గంజాయి కేసులు నమోదు చేశారు. దాదాపు 697 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.58.80 లక్షల విలువైన 1400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఉపయోగించిన 67 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు 2022లో 103 గంజాయి కేసులు నమోదుకాగా, 205 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నంచి 765 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంటే 2021లో 145 గంజాయి కేసులు నమోదు చేసి 308 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి కోటీ 52 లక్షల 17 వేల 200 రూపాయల విలువైన 1521.72 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 36 వాహనాలను, 66 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. ఇటీవల కాలంలో అక్రమ మద్యం కేసులు కూడా పెరిగాయి. 2022తో పోలిస్తే 2023లో దాదాపు 19 శాతం కేసులు పెరిగాయి.

2022లో 1685 అక్రమ మద్యం కేసులు నమోదు కాగా, 2023లో 2013 కేసులు నమోదు చేశారు. దాదాపు 2086 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.48,14,090 విలువైన 35,813 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

మాడిపోతున్న పూత

(మొదటి పేజీ తరువాయి)

తీసుకునేందుకు వెనుకాడుతున్నారు.

వర్షాలకు పూత మాడిపోయింది

తూము రాధాకృష్ణ, మామిడి రైతు, మల్లవల్లి, బాపులపాడు మండలం

మల్లవల్లిలో నాలుగు ఎకరాల తోట ఉంది. తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు భూమిలో తేమ అధికంగా ఉండటంతో మామిడి తోటల్లో వచ్చిన పూత మాడిపోయింది. పూత రావడానికి ఇప్పటికే నెల రోజులు ఆలస్యమైంది. ముందస్తుగా తోటలను కొనడానికి వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. వ్యాపారులెవరూ ముందుకు రావడం లేదు. పూత రావడానికి, కాపు పడటానికి మందులు కొడుతున్నాం. అప్పులు తెచ్చి తోటలకు పెట్టుబడులు పెడుతున్నాం.

సన్నబియ్యం ధరలతో ప్రజలు పరేషాన్

ప్రజాశక్తి-గన్నవరం: విపరీతంగా పెరిగిన సన్న బియ్యం ధరలతో జనాలు పరేషాన్ చెందుతున్నారు. ఇంటింటా.. ఇదే పరిస్థితి. కూరగాయలు కొనే శక్తి తగ్గిపోతోంది. పప్పు, ఉప్పు కొనే సీన్ లేకుండా పోయింది. కనీసం పచ్చడి మెతుకులు తిందామన్నా ఆ ప్రాప్తి కూడా లేకుండా పోతోంది. దీనికి కారణం భయపెడుతున్న బియ్యం ధరలు. ప్రస్తుతం గన్నవరం మార్కెట్లో కేలో బియ్యం ధర 70 నుంచి 75 రూపాయలు ఉంది. సామాన్యులు ఎవరైనా కొనగలరా? కానీ గన్నవరం డివిజన్లో ఇప్పుడు అన్ని చోట్లా ఇదే సీన్. సన్న బియ్యం ధరల దెబ్బకు మధ్యతరగతి వారికి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఇలాగైతే ఒక్కో గింజను లెక్కబెట్టుకుని పొదుపుగా తినాల్సిందే అని ఆవేదనతో చెబుతున్నారు. అసలు.. బియ్యం రేటు ఎందుకు ఇంతలా పెరిగింది? దీనికి కారణాలు ఏమిటి? మళ్లీ రేటు ఎప్పుడు తగ్గుతుంది?అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

2019లో కిలో బియ్యం ధర దాదాపు 30 నుంచి 35 రూపాయిల లోపే ఉంది. కానీ ఇప్పుడు కేజీ రైస్ రేటు దాదాపు 65 నుంచి 75 రూపాయిల మధ్య ఉంది. ప్రతీ సంవత్సరం సగటున ఒక్కొక్కరూ 102 కేజీల బియ్యాన్ని వినియోగిస్తారు. ఈ లెక్కన చూస్తే.. 102 కేజీలకు ఒక్కో వ్యక్తిపై పడే భారం భారీగానే ఉంటుందని అర్థమవుతుంది. ఒక ఫ్యామిలీలో నలుగురు ఉన్నట్టయితే ఇక వాళ్ల నెత్తిన బడ్జెట్ బాంబ్ పడినట్టే. దీంతో బియ్యం కొనాలా.. పస్తులుండాలా.. మధ్యే మార్గంగా.. అర్థాకలితో రోజంతా గడపాలా అన్నది అర్థం కాక సామాన్యులు సతమతమవుతున్నారు. బియ్యం రేటు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంది. కొన్ని చోట్ల 70 రూపాయిలు దాటితే.. మరికొన్ని చోట్ల 70 రూపాయిల లోపే ఉంది. ఇక మాల్స్ కు వెళ్లి కొనాలంటీ చిరిగినట్టే.. అక్కడ 75 నుంచి 80 రూపాయిల మేర అమ్ముతున్నారు. బియ్యం రేటు ఇంతలా పెరిగిపోవడంతో సామాన్యులకు నోట ముద్ద దిగడమే కష్టమవుతోంది. అందుకే కేంద్రం.. భారత్ బియ్యం పేరుతో కిలో 25 రూపాయిల చొప్పున మార్కెట్లోకి రిలీజ్ చేస్తోందని చెప్పింది కానీ అమలు చేయలేదు. నిజానికి పంట చేతికొచ్చే సమయంలో బియ్యం ధరలు తగ్గుముఖం పడతాయి. కానీ ప్రస్తుత పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంది. ఖరీఫ్ పంట వస్తున్నా.. రైస్ రేటు మాత్రం తగ్గలేదు. ప్రస్తుత పరిస్థితి చూస్తే.. మార్కెట్లో దీని ధర ఇంకా పెరిగే సూచనలే ఉన్నాయి. ఇప్పుడు మార్కెట్లో చూస్తే..బస్తా (75 కేజీలు) 4000 నుండి 4500 రూపాయిలు పలుకుతోంది. అదే పాత బియ్యం అయితే.. 5200 నుంచి 5600 వరకు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఓ వెయ్యి రూపాయిలు ఎక్కువే ఉంది. అంటే సుమారుగా 25 నుంచి 26 శాతం మేర రేటు పెరిగిందన్నమాట. పాత బియ్యం 25 కేజీల బస్తా కావాలంటే.. ఎలా లేదన్నా దాదాపు 1500 నుండి 1750 రూపాయిలు పెట్టాల్సిందే. సూపర్ ఫైన్ సన్నబియ్యం కేజీ కావాలంటే.. 90 రూపాయిలు అంటున్నారు. అంటే సామాన్యుడు ఏం తినాలి? ఎలా బతకాలి?అని మదన పడుతున్నారు. మిచౌంగ్ తుపాను ప్రభావం వల్ల పంట పూర్తిగా చేతికి రాని పరిస్థితి. బియ్యం ధర పెరగడానికి ఇది కూడా ఓ కారణం. ఈ పరిస్థితులు ఎలా ఉన్నా.. సామాన్యుడికి మూడు పూటలా ముద్ద దిగాలంటే.. అన్నం ఉడకాలి. దానికి బియ్యం కావాలి. దానికి డబ్బులు కావాలి. కానీ కేజీ రైస్ ఇంత రేటు ఉంటే.. దానిని కొనేదెలా? తినేదెలా?అని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా బియ్యం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామాల్లో 'బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి-గూడూరు

పెడన నియోజవర్గ టిడిపి ఇంచార్జ్ కాగిత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గూడూరు మండలం రామానుజ వత్తర్లపల్లి గ్రామంలో బాబు షూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పర్యటించి గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ పరిశీలకులు సాగర బోయిన ఏడుకొండలు, మండల అధ్యక్షులు పోతన లక్ష్మీ నరసింహస్వామి, గోపి నాగబాబు, ఎన్ ఏ బేగ్, కాసగాని శ్రీనివాస్, పోతుల రాము, సిరివెళ్ల శ్రీను, పాలగాని సిద్ధు పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు**: మండలంలోని అంగలూరు, సింగలూరు గ్రామంలో బాబు షూరిటి – భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికీ టిడిపి మినీ మ్యానిఫెస్టో ద్వారా కలిగే లబ్ధిని, అభివద్ధిని వివరిస్తూ గుడివాడ టీడీపీ ఇంచార్జ్ వెనిగండ్ల రాము పర్యటించారు. ఈ కార్యక్రమంలో జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మాజీ శాసనసభ్యులు రావి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ మేలు జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): అర్హులైన పేదలందరికీ మేలు జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని వారి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ గా నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి 68,990 మంది లబ్ధిదారులకు 97.7 6 కోట్ల రూపాయలను బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నవరత్నాలు పేరుతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.ఎవరైనా అర్హులై ఉండి పొరపాటున గాని, సరైన పత్రాలు గాని సమయానికి లేక గానీ లేక ఏదేని కారణం చేత ఏదైనా పథకం అందకపోతే అటువంటివారు ప్రతి సంవత్సరము ఆరు నెలలకు ఒకసారి జూన్, డిసెంబర్ నెలల్లోగా తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలన జరిపి పథకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హత కలిగి వుండి ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకం లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. అర్హులైన వారందరికీ సంతృప్తి స్థాయిలో ప్రభుత్వ పథకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆ ప్రకారం జిల్లాలో ఈబీసీ నేస్తం, జగనన్న అమ్మఒడి, జగనన్న చేదోడు, వైయస్సార్ కళ్యాణమస్తు-షాదీ తోఫా, వైయస్సార్ కాపు నేస్తం, వైఎస్ఆర్ మత్స్యకార భరోసా, వైయస్సార్ నేతన్న నేస్తం, వైయస్సార్



వాహన మిత్ర పథకాల కింద 1978 మంది లబ్ధిదారులకు 2.93 కోట్ల రూపాయలను కొత్తగా ద్వైవార్షిక మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్ధిదారులకు వివిధ పథకాల కింద 8 రకాల నమూనా మెగా చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం డిఆర్డిఎ ఆధ్వర్యంలో జగనన్న పింఛను కానుక పై రూపొందించిన గోడ పత్రాలను జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, ఉప మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్షాద్ నజరానా డిఆర్డిఏ పిడి పిఎస్ఆర్ ప్రసాద్ బీసీ కార్పొరేషన్ ఈడీ కె రాజేంద్ర బాబు, మత్స్యశాఖ జేడీ ఏ చంద్రశేఖర్, చేనేత జౌళి శాఖ డివో డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి: రాష్ట్ర ప్రజలు మరోసారి జగన్ పరిపాలన కోరుకుంటున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం చల్లపల్లి పడమర వైపు గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. ఆరోగ్య సురక్ష సమర్ధవంతంగా అమలు చేయటంతో పాటు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఉచిత వైద్య సేవల పరిధిని రూ.25లక్షలకు పెంచి నిరుపేద కుటుంబాలకు వైద్య భరోసా కల్పించిన ఘనత పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చేకు చిన్న రాట్నాలు, పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు, శానిటరీ అధికారి కలతోటి సుధాకర్, పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతా రామారావు (ఫణి), వైసీపీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, పార్టీ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, వెనిగళ్ళ తారక జగదీష్, పఠాన్ కరీముల్లా ఖాన్, యడ్ల జగదీష్, జుజ్జువరపు భాగ్యారావు పాల్గొన్నారు. **మోపిదేవి:** మోపిదేవిలోని మండల పరిషత్ పాఠశాల ఆవరణలో శు క్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని



చల్లపల్లిలో కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించారు. వైద్యులు బి లక్ష్మీనాథ్, హారికల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రకాల వైద్య నిపుణులు శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించి, తగిన మందులు అందజేశారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీలో మెరుగైన వైద్యం నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, సర్పంచులు నందిగం మేరీ రాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు, పిఏసిఎస్ చైర్ పర్సన్లు ఆది రవీంద్రబాబు, రావి రాంప్రసాద్, మాజీ చైర్మన్ కామిశెట్టి వెంకట సురేష్ బాబు, నాయకులు నందిగం అభిషేకరావు పాల్గొన్నారు. **పమిడిముక్కల:** మండలంలోని ఆగినపర్రు ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, మండల వైసిపి అధ్యక్షులు యలమంచిలి గణేష్, సర్పంచ్ కోట మణిరాజ్, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు అక్కినేని సతీష్, కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మేరుగ బాలాజీ పాల్గొన్నారు. **హనుమాన్ జంక్షన్:** జగనన్న సురక్ష శిబిరాలు గ్రామాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి నాంది పలికారని రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ నక్క గాంధీ అన్నారు. బాపులపాడు మండలం వేలేరు గ్రామంలో ఎంపీపీ నగేష్, కన్వీనర్ శేషగిరిరావులతో కలిసి ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ పర్యవేక్షణలో డాక్టర్ మంజూష 256 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గంగాభవాని, ఎంపీడీవో జోగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ సుందరమ్మ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు: నిరుపేదలకు అండగా వారి ఆర్థికాభివృద్ధికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గూడూరు, మల్లవోలులో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వీటితో పాటు కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలతో పాటు పింఛను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలో కొత్తగా పింఛన్ మంజూరైన 150 మందితో కలిపి మొత్తం 8,579 మందికి పింఛను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎంపీపీ మధుసూదనరావు, జడ్పిటిసి వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకటకృష్ణ, కారుమంచి కామేశ్వరరావు, రైల్వే బోర్డు మెంబర్ రత్నారావు, వైస్ ఎంపీపీ ఎన్.కుటుంబరావు, సర్పంచ్‌లు సులోచన రాణి, బొర్రా సాంబశివయ్య, ఎంపీడీవో డి సుబ్బారావు, తాసిల్దారు బి.వి ప్రసాద్ పాల్గొన్నారు.

'చెరకును 24 గంటల్లో తరలించాలి'

ప్రజాశక్తి-పమిడిముక్కల: చెరకును నరికిన 24 గంటల్లోపు ఉయ్యూరు కెసిపి షుగర్ ఫ్యాక్టరీకి తీసుకువెళ్లాలని వ్యవసాయ శాస్త్రవేత్త సుధారాణి అన్నారు. శుక్రవారం మండలంలోని తాడంకి గ్రామంలో చెరుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆమె వివరించారు. 40 టన్నుల పైగా చెరుకును ఎకరానికి పండించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-గన్నవరం: గంజాయి తాగుతున్న ఐదుగురు వ్యక్తులను వారి వద్ద నుండి 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పీ. కనకారావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఐ నవీన్ కుమార్‌కు రాబడిన సమాచారం మేరకు గన్నవరం మండలం, అల్లాపురం గ్రామంలోని, ఏలూరు కాలువ కట్ట సమీపములో చెకింగ్ నిర్వహించారు. ఆ సమయంలో గన్నవరం పరిసర ప్రాంతాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు కొండ వెంకటేశ్వర రావు , దుంపల ఈశ్వర్ రాంబాబు ఏ రాంబాబు, తాడిశెట్టి లక్ష్మ రాయుడు , నంద్యాల క్రాంతి కుమార్ కాట్రు దినేష్ అనువారు గంజాయి సేవించటానికి ఏలూరు కాలువ కట్ట వద్దకు రాగా వారి వద్ద నుండి 500 గ్రామ్స్ గంజాయి స్వాధీనపరచుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఇందుకుగాను వారికి కోర్ట్ 14 రోజులు రిమాండ్ విధించిందన్నారు.



ఎండకుదురు ప్రజల దాహార్తిని తీర్చండి : సర్పంచ్

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని ఎండకుదురు ప్రజల దాహార్తిని తీర్చి ఆదుకోవాలని సర్పంచ్ ముళ్ళపూడి పట్టాభి రామారావు, ఎంపీటీసీ సిద్ధినేని కుమార్‌రాజా అధికారులను అభ్యర్థించారు. శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వచ్చిన మండల అధికారుల వద్ద సర్పంచ్ రామారావు మాట్లాడుతూ ఊరికి మంచినీటి చెరువు ఉంది కానీ, పేరు గొప్ప ఊరు దిబ్బ మాదిరిగా ఉందని ఏమాత్రం గ్రామానికి ఉపయోగకరంగా లేదని అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చెరువుకి పైప్లైన్ వేసి సుమారు 40 సంవత్సరాలు అవుతుందని అవి నిరుపయోగంగా ఉన్నాయని అన్నారు. మంచినీళ్లు తెచ్చుకోవాలంటే మహిళలు రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి తెచ్చుకోవాలని మా గోడు పట్టించుకుని నాధుడే లేకపోయాడని ఆవేదన చెందారు. చాలా సంవత్సరాల నుంచి చెరువు పూడికతీత పనులు చేయకపోవడంతో చెరువు బాగా మెరక తేలడంతో నీళ్లు కేవలం రెండడుగుల లోపు మాత్రమే ఉంటున్నాయని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి వేసకాలంలో పూడిక తీయించి ఎండకుదురు, జిలకలగండి గ్రామాలకు మంచినీటి సౌకర్యం అందేలా చూడాలని అలాగే చెరువు నుండి మంచినీరు ఫిల్టర్ చేసి గ్రామాలకు వెళ్లేలా పైప్ లైన్లు నూతనంగా నిర్మించాలని అధికారులను కోరారు. స్పందించిన ఎంపీడీవో టి. అనూహ్యకు మంచినీటి చెరువును పరిశీలించి సమస్యను పై అధికారుల దష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేలా అన్ని విధాల కషి చేస్తానని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో సిద్దినేని రజిని నాలుగో వార్డ్ సభ్యులు వెంకటేశ్వరరావు గ్రామస్తులు పాల్గొన్నారు.




బాలుడిని సత్కరిస్తున్న దృశ్యం

సాహస బాలుడికి సత్కారం

జగ్గయ్యపేట: ప్రమాదవశాత్తూ బావిలో పడిన మహిళను కాపాడిన బాలుడిని శుక్రవారం మల్కాపురం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సన్మానించారు. వివరాలు పరిశీలిస్తే... గత నెల 9న మల్కాపురం గ్రామ సమీపంలో సోంపోంగు రాజ్యం అనే మహిళ బావిలో పడిపోయింది. ఇది గమనించిన ఆమె కుమారుడు ఐజాక్ ఏడో తరగతి విద్యార్థి సూరపల్లి రాజేష్‌కు తెలిపాడు. దీంతో రాజేష్ బావిలో దూకి రాజ్యంను కాపాడాడు. విషయం తెలిసిన పాఠశాల చైర్మన్ మీషక్, ప్రధాన ఉపాధ్యాయులు పి.వి.నాగేశ్వరరావు, మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చావా శ్రీధర్, గ్రామస్తులు రాజేష్‌ను ఘనంగా సన్మానించారు. హెచ్.ఎం మాట్లాడుతూ అత్యంత ధైర్య సాహసాలు చూపి మహిళను కాపాడిన రాజేష్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సాహస బాలుని విషయం స్థానిక ఎంఎల్ఎ సామినేని ఉదయభానుకు విషయం తెలియజేసి 2024 సాహస బాలుర అవార్డుకు నామినేషన్‌కై పంపిస్తామని తెలిపారు.

పేటకు స్విమ్మర్లే ఐకాన్


స్విమ్మింగ్ విజేతలతో సామినేని

జగ్గయ్యపేట: జగ్గయ్యపేటకు చెందిన డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి అవార్డులను అందజేయడం ద్వారా జగ్గయ్యపేట కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపచేయడం స్ఫూర్తిదాయకమని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని స్థానిక ఉక్కు కళావేదికలో గురువారం రాత్రి జరిగిన డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ సన్మాన సభ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ డిసెంబర్ 24వ తేదీ కర్నూలులో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో జగ్గయ్యపేటకు చెందిన డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ వారు పాల్గొని 93 పతాకాలు సాధించి విజయభేరి మోగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, డ్రీమర్స్ స్విమర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.**(ప్ర.వి)**

విజ్ఞాన్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న సుధారాణి

జగ్గయ్య పేట: పట్టణంలోని స్థానిక విజ్ఞాన్ విద్యా సంస్థలలో స్పోర్ట్స్ మీట్ 2023 - 24 రెండు రోజులపాటు నిర్వహించే ఈ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి ఈ పోటీల లోగోను ఆవిష్కరించి, క్రీడా జ్యోతి వెలిగించి లాంచనంగా ప్రారంభించారు. అనంతరం క్రీడా జ్యోతిని పట్టణ ప్రధాన వీధుల గుండా తిప్పుతూ క్రీడా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఎన్‌సిసి, క్రీడలు వంటి రంగాలను చదువుతో పాటూ అదనపు అర్హతగా ఉంచుకోవాలని, విద్యార్థులకు ఈ అవకాశాలను కల్పించటంలో మన విజ్ఞాన్ విద్యా సంస్థ ఎపుడూ ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ పి శ్రీనివాస రెడ్డి, పి.ఈ రీ హరిశ్చంద్ర, ఉపాధ్యాయులు కిరణ్, మహమూద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయంగా పోల్చడంలో రాంభట్ల ప్రత్యేకం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భారతీయ తత్వశాస్త్రాలు, వేదాలు, పురాచరిత్ర, చరిత్ర, సాహిత్యం తదితర అంశాలను ప్రపంచంలోని ఇతర వాంగ్మయాలతో శాస్త్రీయంగా పోల్చి, సమన్వయ పరచడంలో రాంభట్ల కృష్ణమూర్తిది ప్రత్యేక ఘనత అని ప్రముఖ పాత్రికేయులు, రచయిత కల్లూరి భాస్కరం అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవం తొమ్మిదోరోజు శుక్రవారం కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్య వేదికపై రాంభట్ల కృష్ణమూర్తి శతజయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంభట్లను బడిచదువులు లేని బహుముఖ ప్రజ్ఞాశాలిగా వర్ణించారు. సంక్లిష్టమైన విషయాలను సరళంగా అర్థమయ్యేలా వివరించడం ఆయన ప్రత్యేకత అని చెప్పారు. తత్వశాస్త్రం జ్ఞానం పునాదిగా చేసే ఆలోచన, అయితే మతం విశ్వాసం పునాదిగా చేసే ఆలోచన అని అన్నారు. మన దేశంలో మతం జ్ఞానానికి అడ్డంగా మారిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాంభట్ల కృష్ణమూర్తి రచనలు అందరూ చదవాలన్నారు. భారతీయ నాగరిత ప్రస్తుతం బైకాల్ అని పిలువబడుతున్న వైఖానస సరస్సు ఒడ్డున ప్రారంభమయ్యిందని రాంభట్ల ప్రతిపాదించారని వివరించారు. మన రామాయణ భారతాలు భారత ప్రాంతానికి పరిమితమైన కథలు కావని రాంభట్ల అనేక శాస్త్రీయ ప్రతిపాదనలు చేశారన్నారు. ప్రముఖ పాత్రికేయులు తాడి ప్రకాష్ మాట్లాడుతూ రాంభట్ల తెలుగు సరళంగా సుబోధకంగా ఉంటుందన్నారు. జ్ఞానవృద్ధుడైన రాంభట్ల తనకన్నా చిన్నవయసువాళ్లతో చాలా స్నేహంగా, ఆత్మీయంగా ఉండేవారన్నారు. గురజాల మాల్యాద్రి మాట్లాడుతూ ఆశయం, కషి ఉంటే చదువుతో సంబంధంలేకుండా ఉన్నత విజయాలు సాధించడం సాధ్యమేనని రాంభట్ల నిరూపించాడన్నారు. అరసం వారు ప్రచురించి రాంభట్ల స్మృతి సంచికను వేదికపై ఆవిష్కరించారు. పుస్తక మహోత్సవ సంఘం అధ్యక్షులు మనోహర్ నాయుడు సభకు అధ్యక్షత వహించారు. బెల్లపు బాబ్జీ, కె.లక్ష్మయ్య సభలో పాల్గొన్నారు.

పూసపాటి కృష్ణంరాజు కథా సంపుటి ఆవిష్కరణ

పూసపాటి కృష్ణంరాజు కథా సంపుటి 'దివాణం సేరీ వేట' పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాత్రికేయులు తాడి ప్రకాష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాజ్యాలు పోయినా భేషజాలు మిగిలిన రాజుల జీవితాలలోని విషాదాలను హాస్యంగా వ్యక్తీకరించిన రచయిత పూసపాటి కృష్ణంరాజు అన్నారు. తమ సామాజిక వర్గంలోని లోపాల గురించే తామే విమర్శించుకోగలగడం విశేషమన్నారు. చాలా తక్కువ కథలతో సాహిత్యంలో సుస్థిరస్థానం ఏర్పాటు చేసుకున్న ఘనత పూసపాటి కృష్ణంరాజుకు దక్కుతుందని ప్రముఖ రచయిత కల్లూరి భాస్కరం చెప్పారు. ఆయనను ప్రముఖ రచయిత పతంజలి తన గురువుగా భావించారన్నారు. తన కథలో మారుమూల శ్రీకాకుళం మాండలికాన్ని హృద్యంగా


రాంభట్ల స్మృతి సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు



'దివాణం సేరీ వేట' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పొదిగారన్నారు. మహ్మద్ ఖదీర్ బాబు మాట్లాడుతూ పుస్తకమహోత్సవంలో స్థానిక విద్యార్థులను మిళితం చేయాలని సూచించారు. కూనపరాజు కుమార్ తెలుగులో కథా సాహిత్యాన్ని మళ్లీ ఉన్నతస్థాయికి తీసుకువెళ్లేందుకు సాహిత్య ప్రేమికులంతా ప్రయత్నించాలన్నారు. కేవలం రససిద్ధి కోసం ఒకానొక సామాజిక పరిణామాన్ని చిత్రీకరించడం కోసం కథలు రాసిన కొద్దిమందిలో పూసపాటి కృష్ణంరాజు ఒకరన్నారు. సభలో సాహితీ ప్రచురణల ప్రతినిధి సాందీపని పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలి



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్, రోజ్ సొసైటీ సంయుక్తంగా ఏర్పాటుచేసిన గులాబీ ప్రదర్శన ఆకట్టుకుంటుంది. శుక్రవారం ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దండా వీరాంజనేయులు, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మొక్కలపై అవగాహన కల్పించడంతో పాటు, మొక్కలను ఏవిధంగా పెంచాలో తెలియచేడమే ప్రధాన ఉద్దేశంగా నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. విజయవాడ నగరంలో ఏర్పాటు చేసిన గులాబి మొక్కల ప్రదర్శనతో పాటు, హార్టి కల్చరల్ షోలో తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. గులాబీ మొక్కలతో పాటు అందమైన వివిధ రకాలైన మొక్కలను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. ఇక్కడ ప్రదర్శన జరిగే రోజుల్లో ప్రదర్శనలోని ఆంధ్రానర్సరీ ఫార్మర్స్ స్టాల్ వద్ద 'క్యూ అర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంటుందన్నారు. దీని ద్వారా ప్రతి గంట గంటకు లక్కీ డ్రా నిర్వహించి విజేతలైన వారికి బహుమతులను అందచేయనున్నట్లు తెలిపారు. ప్రదర్శనకు హాజరైన ప్రతి ఒక్కరికీ మొక్కలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తొలిరోజు నిర్వహించిన ఆంధ్రా నర్సరీ ఫార్మర్స్ లక్కీ డ్రాలో ఎం.శ్రేష్ట, డి.ప్రీతిక. వాణ విజేతలుగా నిలిచారని తెలిపారు. రోజ్ సొసైటీ అధ్యక్షులు మలినేని నారాయణ ప్రసాద్ శుక్రవారం డ్రా తీసి విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా నర్సరీ అసోసియేషన్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కిరణ్ కుమార్, అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.వి.సత్యనారాయణ, సెక్రటరీ శ్రీనివాసరావు, ట్రెజరర్ కిషోర్ కుమార్. కిరణ్ కుమార్. లోవరాజు తదితరులుపాల్గొన్నారు.

శ్రమ తోడైతే విజయం సొంతం



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఏ పోటీ పరీక్షకైనా హాజరయ్యేవారు ప్రతిరోజు అన్ని దినపత్రికలలో కరెంట్ అఫైర్స్ పరిశీలించాలని, దీనికి కఠోర శ్రమ తోడైతే అనుకున్న విజయాన్ని సాధిస్తారని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు కే ఎస్ లక్ష్మణరావు అన్నారు. సర్వోత్తమ గ్రంథాలయం ఆధ్వర్యాన శుక్రవారం సాయంత్రం జరిగిన గ్రూప్-2 పరీక్షలు హాజరయ్యే వారికి అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహిస్తూ అపజయం విజయానికి దారి చూపుతుందన్నారు. గ్రూప్ 2 పరీక్ష సిలబస్, ప్రశ్నల సరళితోపాటు గతంలో జరిగిన పరీక్ష పేపర్లను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని నోట్స్ తయారు చేసుకోవాలన్నారు. హిస్టరీ, జాగ్రఫీ, భారత సమాజం, కరెంట్ అఫైర్స్ తో పాటు మెంటల్ ఎబిలిటీ అనే ఐదు అంశాలలో 30 మార్కులు చొప్పున 150 మార్కులకు ప్రశ్నలుంటాయన్నారు. ఇందులో 90 మార్కులు పైన సాధిస్తే మెయిన్స్ కి వెళ్లడానికి అవకాశాలుంటాయని అన్నారు. మెయిన్స్ 300 మార్కులలో ఆంధ్రుల చరిత్ర, ఇండియన్ పాలిటీ, భారత-ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాలు వంటి నాలుగు పేపర్లలో ఒక్కొక్క దానిలో 75 మార్కులు చొప్పున ప్రశ్నలుంటాయన్నారు. గ్రంథాలయం కార్యదర్శి రావి శారద ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా నగరం నుండి ఈ పరీక్షలకు హాజరయ్యే సుమారు వందమంది అభ్యర్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా విచ్చేసిన అభ్యర్థులందరికీ ఆయన రచించిన భారత సమాజం, ఆంధ్రుల చరిత్ర-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలపై గల పుస్తకాలను ఉచితంగా అందజేశారు.

భవానీల గిరిప్రదక్షిణలతో నగరం రద్దీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : భవానీల దీక్షా విరమణల నేపథ్యంలో మూడవ రోజు శుక్రవారం దుర్గమ్మ దర్శనానికి సుమారు 75 వేల మంది వరకూ దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌లు చేరుకున్న వేలాదిమంది భవానీలు అక్కడినుండి కాలి నడకన దుర్గమ్మ దేవాలయానికి చేరుకుంటున్నారు. దీంతో లోబ్రిడ్జి, కాళేశ్వరరావు మార్కెట్, కెనాల్ రోడ్డు, విఎంసి కార్యాలయం, గాంధీజీ కళాశాల ప్రాంతాలు రద్దీగా మారాయి. దుర్గమ్మ ఆలయం వద్దకు చేరుకునే భవానీలు విఎంసి కార్యాలయం, దుర్గాఘాట్, పున్నమి ఘాట్‌ల వద్దకు చేరుకుని కేశఖండన శాలలో మొక్కులు తీర్చుకుంటున్నారు. షవర్ల వద్ద భవానీల స్నానాదికాలు పూర్తిచేసుకుని కొండ చుట్టూ గిరిప్రదక్షిణ చేపట్టారు. వినాయకుని గుడి వద్ద నుండి క్యూలైనులలో దుర్గమ్మను దర్శించుకుని ఇరుముడిని అమ్మవారికి సమర్పించి మల్లేశ్వరాలయం మెట్ల మార్గం ద్వారా మల్లికార్జున మహామండప ప్రాంగణానికి చేరుకుని గురుస్వామి వద్ద మాల తీయడంతో దీక్ష విరమణ ప్రక్రియ పూర్తి చేసుకుంటున్నారు.

అన్నప్రసాదం, లడ్డూల ప్రసాదం తయారీ కేంద్రం పరిశీలన

శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి భక్తులకు అందుచున్న పలు సదుపాయాలను పరిశీలించడంలో భాగంగా శుక్రవారం ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇఒ కెఎస్.రామారావు అన్నప్రసాదం తయారీ కేంద్రాన్ని పరిశీలించి పదార్థముల నాణ్యత, రుచి తదితరములను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆలయానికి వచ్చిన ప్రతి యాత్రికుడికి అన్నప్రసాదం స్వీకరించేలా చూడాలని తెలిపారు.

వివిధ రకాల పూలతో ఆలయ ప్రాంగణం ఆలంకరణ

భవానీ దీక్షా విరమణల మూడో రోజు శుక్రవారం దేవాలయ ప్రాంగణాన్ని వివిధ వర్ణాల పూలతో అలంకరించి తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణమంతా పూలతో ఆలంరించటంతో భవానీలు, యాత్రికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరగనున్న భవానీల దర్దీ దృష్ట్యా అధికారులతో సిపి సమీక్షా సమావేశం

భవానీ దీక్షా విరమణల సందర్భంగా రానున్న రెండు రోజులు 6, 7 తేదీలలో పెరగనున్న భవానీల రద్దీ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా బందోబస్త్ అధికారులతో సమావేశం నిర్వహిచారు. 5వ తేదీ శుక్రవారం రాత్రి నుండి రాష్ట్రంలోని నలుమూలల నుండి భవానీ భక్తులు అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో వస్తారని తెలిపారు.. దర్శనం అనంతరం కనకదుర్గా నగర్‌లోని హోమగుండాలు, మాల విరుముడి విరమణ, ప్రసాదం కౌంటర్ల వద్ద, కనకదుర్గా నగర్ నుండి వినాయక


దుర్గమ్మ దర్శనం కోసం వస్తున్న భవానీలు


మాట్లాడుతున్న సిఇ కాంతి రాణా టాటా

టెంపుల్ వరకు కెనాల్ రోడ్డులో యాత్రికులు నిలబడకుండా ఎప్పటికప్పుడు ముందుకు కదిలేవిధంగా చర్యలు తీసుకోవాలని, విధులు నిర్వహించు సమయంలో ఎక్కడా సిబ్బంది అలసత్వం ప్రదర్శించ కుండా విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.టి.ఆర్. జిల్లా నగర పోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటాతో పాటు, డి.సి.పి. విశాల్ గున్ని, ట్రాఫిక్ డి.సి.పి. కె.చక్రవర్తి, టెంపుల్ ఈ.ఓ. కె.ఎస్.రామారావు, పశ్చిమ ఏ.సి.పి. డా.కె.హనుమంత రావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.